క్లుప్తంగా

వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలి

పుల్లలచెరువు: దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో శామ్యూల్‌జాన్ తెలిపారు. ఈ నెల 29వ తేదీన శిబిరం మార్కాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యనభ్యసించే 6 నుంచి 17 ఏళ్ల దివ్యాంగ విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. శిబిరంలో నిపుణులైన వైద్యులతో పరీక్షలు చేసి వివిధ రకాల ఉపకరణాలు అందజేస్తారన్నారు. శిబిరానికి వచ్చే దివ్యాంగ విద్యార్థులు మూడు పాస్‌పోర్టు ఫొటోలు, సదరం సర్టిఫికెట్ జిరాక్సు, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్సులు తప్పని సరిగా తీసుకురావాలన్నారు. గ్రామాల్లో ఉన్న దివ్యాంగ విద్యార్థులను గుర్తించి వైద్య శిబిరానికి వచ్చేలా చూడాలని ఎంఈవో కోరారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

పుల్లలచెరువు: పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలు పెంచే విధంగా వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో శామ్యూల్‌జాన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్స్ తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారిలో సామర్థ్యాలు పెంచాలన్నారు. విద్యార్థులతో ఇంగ్లిష్‌లో రాయించడం, చదివించడం రోజు చేయించడంతో పాటు వర్క్ బుక్‌లు కూడా విజిట్ చేస్తూ విద్యార్థులకు తగిన సూచనలు ఇవ్వాలన్నారు.

వలంటీర్ పోస్టుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

కొమరోలు: మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో నరసయ్య తెలిపారు. వివిధ గ్రామ పంచాయతీల పరిధిలో 9 గ్రామ వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. బ్రాహ్మణపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో 1, చింతలపల్లిలో 2, దద్దవాడ, ఇడమకల్లు, కొమరోలు-1, కొమరోలు-3, నల్లగుంట్ల, సూరవారిపల్లె గ్రామ సచివాలయాల పరిధిలో ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నాయని, ఈ నెల 30వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 18 ఏళ్లు నిండి 35 ఏళ్ల లోపు ఉండి 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు ఈ పోస్టులకు అర్హులన్నారు. ఈ నెల 31వ తేదీన దరఖాస్తులు పరిశీలించి 1వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఎంపీడీఓ తెలిపారు.

జగనన్నతోనే మహిళా సాధికారిత సాధ్యం

- ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్
- మహిళలకు రూ.32.28 కోట్ల చెక్కుల పంపిణీ



మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్

ముండ్లమూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డితోనే మహిళా సాధికారిత సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. స్థానిక హైస్కూల్ ఆవరణలో దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల మహిళలకు సోమవారం వైఎస్సార్ ఆసరా చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ మహిళల అభివృద్ధే లక్ష్యంగా సీఎం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. పేద నిరుపేదల అవసరాలను గుర్తించిన జగనన్న విద్యార్థుల నుంచి అవ్వాతాతల వరకు వారికి అవసరమైన పథకాలు అమలు చేసి ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలనలో ప్రతి కుటుంబానికి లక్షల రూపాయలు అందించి మార్పు తెచ్చిన ఘనత ముఖ్యమంత్రికే దక్కిందన్నారు. ప్రత్యేకంగా మహిళల కోసం రుణమాఫీ అమలు చేస్తూ వారి ఎదుగుదలకు జీవనోపాధులు సమకూర్చుకునేందుకు అవసరమైన ఆర్థిక చేయూత ఇచ్చినట్లు పేర్కొన్నారు. మహిళా సాధికారితకు పెద్దపీట వేస్తున్న జగనన్నను రానున్న ఎన్నికల్లో మరో సారి ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా అందరం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత పథకాలతో మహిళలను ఆదుకుంటున్నట్లు పేర్కొన్నారు. మహిళా పక్షపాతి జగనన్న వెంట తాను నడుస్తున్నందున, మీ ఆశీస్సులు అందించి వచ్చే ఎన్నికల్లో అండగా నిలవాలన్నారు. ముందుగా ఎమ్మెల్యేకు మహిళలు పూలు జల్లుతూ స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మహిళలతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

వైఎస్సార్ సీపీ యువజన నాయకుల ఆధ్వర్యంలో గజమాలతో ఎమ్మెల్యే వేణుగోపాల్‌ను ఘనంగా సన్మానించారు. మూడు మండలాల మహిళలకు 24 కోట్ల నాలుగు లక్షల వైఎస్సార్ ఆసరా చెక్కు, ముండ్లమూరు మండలానికి ఎనిమిది కోట్ల నాలుగు లక్షల బ్యాంకు రుణం చెక్కును ఎమ్మెల్యే పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుంకర బ్రహ్మారెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ రాష్ట్ర డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, ముండ్లమూరు, తాళ్లూరు, దర్శి ఎంపీపీలు సుంకర సునీతాబ్రహ్మారెడ్డి, తాడికొండ శ్రీనివాసరావు, గోళ్లపాటి సుధారాణి, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల సచివాలయాల కన్వీనర్లు మేడికొండ జయంతి, శ్రీనివాసరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ భిక్షాలు రెడ్డి, దర్శి క్లస్టర్ ఏరియా కో ఆర్డినేటర్ వసుంధరాదేవి, తహసీల్దార్ ఉషారాణి, ఏపీఎంలు హనుమంతరావు, విజయకుమారి, దేవరాజ్, సర్పంచ్‌లు జనమాల నాగేంద్రం, ఒగులూరి రామాంజి, కందిమళ్ల గీతాంజలి, రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు జిల్లెలమూడి శివయ్య, అంబటి వెంకటరెడ్డి, వేముల శ్రీను, సుబ్బారెడ్డి, పాలెపోగు దగ్లస్, ఫిలిఫ్ రాజు, జనమాల పిచ్చయ్య పాల్గొన్నారు.

జగనన్న ఆసరా నగదు విడుదల

పెద్దదోర్నాల: మండలంలోని స్వయం సహాయక గ్రూపులకు మూడో విడత జగనన్న ఆసరా నగదు విడదలైనట్లు ఏపీఎం పోలయ్య తెలిపారు. 573 గ్రూపులకు సంబంధించి 5,649 మంది సభ్యులకు మూడు కోట్ల 10 లక్షల 4 వేల 914 రూపాయలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీన యర్రగొండపాలెంలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ చేతుల మీదుగా స్వయం సహాయక సంఘాలకు అందజేయనున్నట్లు వివరించారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్

ముండ్లమూరు: పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలంటే ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. సోమవారం స్థానిక హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి ఉత్తీర్ణత సాధించేందుకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఉన్నత లక్ష్యంతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రతి సబ్జెక్టుపై మక్కువ పెంచుకొని చదవాలన్నారు. మీపై తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకొని కష్టపడి చదివిస్తున్నారనే విషయాన్ని ప్రతి విద్యార్థి గుర్తించుకోవాలన్నారు. కష్టపడి ఉన్నత చదువులు చదివిన వారికి ఉద్యోగావకాశాలు తప్పక వస్తాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి విద్యాభివృద్ధికి అనేక పథకాలు అమలు చేస్తున్నందున వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధగా చదివించి వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే వెంట హెచ్‌ఎం సుజాత, ఉపాధ్యాయులు ఉన్నారు.

పీడీ శ్యామలకు అభినందనలు



శ్యామలదేవిని సన్మానిస్తున్న వనజాక్షి, తదితరులు

మార్కాపురం టౌన్: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డి.శ్యామలదేవి త్వరలో సౌత్ కొరియాలో నిర్వహించనున్న ఆసియా పసిఫిక్ గేమ్స్‌కు వెళ్తున్న సందర్భంగా సోమవారం పాఠశాలలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వారు ఘనంగా సన్మానించి రూ.10 వేలు అందించారు. 40 ఏళ్ల వయసు దాటినప్పటికీ విద్యార్థులకు స్ఫూర్తిగా ఉంటూ అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడం అభినందనీయమని సంస్థ అధ్యక్షురాలు, కో ఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీదేవి, ఎన్.లావణ్య, భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు రవిచంద్ర, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు వినతిపత్రం ఇచ్చిన ఎమ్మెల్యే కేపీ



సీఎం జగన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం కొండపి నియోజకవర్గానికి వచ్చిన సందర్భంగా మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కలిసి వినతిపత్రం అందించారు. మార్కాపురం నియోజకవర్గ వాల్మీకి, బోయలు తమను కూడా ఎస్టీల్లో చేర్చాలని తనకు వినతిపత్రం ఇచ్చిన విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే చెప్పారు.

టూవీలర్‌ల పంపిణీ



టూవీలర్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి

దర్శి: స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పీఎంఎంఎస్‌వై పథకం కింద టూవీలర్‌లు, ఐస్ బాక్స్‌లను ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ సోమవారం పంపిణీ చేశారు. టూవీలర్ నడిపి లబ్ధిదారుల్లో ఎమ్మెల్యే ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ పేదలను ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో టూవీలర్, ఐస్ బాక్స్‌లు అందజేస్తున్నట్లు తెలిపారు. చక్కగా వ్యాపారాలు చేసుకుని కుటుంబాలు ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి ఆకాంక్షించారు. మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వైవీ సుబ్బయ్య, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కేపీకి సన్మానం



ఎమ్మెల్యే కేపీని సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ దివ్యాంగ విభాగం నాయకులు

పొదిలి: వైఎస్సార్ సీపీ దివ్యాంగ విభాగం జిల్లా అధ్యక్షుడు దొంతిరెడ్డి గోపాలరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని సన్మానించారు. పొదిలి మండల, పట్టణ అధ్యక్షునిగా ఎంపికైన దేవళ్ల ఆంజనేయులు, బత్తిన నరసింహారావులు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి తమకు పదవులు ఇచ్చినందులకు కృతజ్ఞతలు తెలిపారు. పదవులకు న్యాయం చేస్తామని చెప్పారు. అనంతరం శాలువా, పూలమాలతో ఎమ్మెల్యేని సన్మానించారు.

లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న ఎంఈవో శామ్యూల్‌జాన్

పుల్లలచెరువు: విద్యార్థులు లక్ష్యంతో చదివితే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని ఎంఈవో శామ్యూల్‌జాన్ అన్నారు. మండలంలోని గారపెంగ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు వీడ్కోలు సభ హెచ్‌ఎం అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు చేరుకునేందుకు పదో తరగతి తొలి మొదటి మెట్టని, మంచి మార్కులు వస్తే ఉన్నత చదువులు చదువుకునేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కష్టపడి చదివితే మంచి మార్కులు సాధించవచ్చని, ప్రభుత్వం అందించే రాయితీలు సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. ఉపాధ్యాయులు పూర్ణయ్య, మస్తాన్‌వలి పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.

అక్కచెల్లెమ్మలకు జగనన్న అండ



మహిళలకు ఆసరా చెక్కు అందిస్తున్న మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు

- ఆసరా పథకం మూడో విడత చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: అక్కచెల్లెమ్మలకు ఆసరాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. ఆసరా పథకం మూడో విడత నగదు చెక్కులను పట్టణ పరిధిలోని పొదుపు సంఘాల మహిళలకు స్థానిక డ్వాక్రా బజారులో సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి అక్కాచెల్లెమ్మ ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. అమ్మ ఒడి, చేయూత, ఆసరా, నేతన్న నేస్తం, పింఛన్ కానుక, రైతు భరోసా, వసతి, విద్యాదీవెన తదితర పథకాల నగదును మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా మహిళల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. నాలుగేళ్లలో 80 శాతం సంక్షేమ పథకాలు అందించి మహిళలను ఆర్థికంగా ఆదుకున్నారన్నారు. మార్కాపురం పట్టణంలో 1,053 సంఘాలకు రూ.7.97 కోట్లను మహిళల బ్యాంకు ఖాతాల్లో జమచేశారన్నారు. ఆసరా నగదుతో వివిధ వ్యాపారాలు ఏర్పాటు చేసుకుని కుటుంబాలను ఆర్థికంగా పోషించుకోవాలని కోరారు. రానున్న ఎన్నికల్లోనూ జగనన్నను మహిళలు ఆశీర్వదించాలని కోరారు. ఆర్పీల పరిధిలో కనీసం 2, 3 యూనిట్లు ఏర్పాటు చేసి 10 నుంచి 20 మంది మహిళలకు ఉపాధి కల్పించే విధంగా ఆలోచనలు చేయాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ మాట్లాడుతూ అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన మాట ప్రకారం వివిధ సంక్షేమ పథకాలతో సీఎం జగనన్న అండగా నిలుస్తున్నారన్నారు. నవరత్నాల పథకాలతో రాష్ట్రంలోని ప్రజలందరూ ఆనందంగా జీవిస్తున్నారన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వం తమదేనన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేసి ఆసరా పథకం చెక్కులు అందించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, కమిషనర్ గిరికుమార్, పొదుపు సంఘాల సమాఖ్య అధ్యక్షురాలు, కౌన్సిలర్ దొడ్డా భాగ్యలక్ష్మి, కౌన్సిలర్లు హర్షిత బాబి, షేక్షావలి, రంగలక్ష్మి, నగేష్, వనజాక్షి, ముత్తారెడ్డి వెంకట్‌రెడ్డి, అమిరుల్లాఖాన్, ఉత్తమ్ కుమార్, కరీంబాషా, మెప్మా అధికారులు, ఆర్పీలు, గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు తర్లుపాడులో ఆసరా చెక్కుల పంపిణీ

తర్లుపాడు: ఆసరా ఉత్సవాల్లో భాగంగా పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు 3వ విడత చెక్కుల పంపిణీని తర్లుపాడు మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి చేతుల మీదుగా చేయనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మురారి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్యనాయకులు, పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలు పాల్గొనాలని కోరారు.

సీఎంను కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ దర్శి నాయకులు

దర్శి: టంగుటూరు మండలం కారుమంచిలో వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు తల్లి కోటమ్మ భౌతిక కాయానికి నివాళులర్పించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్శి మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వైవీ సుబ్బయ్య, రెడ్డి సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, ఎంపీపీ సుధాఅచ్చయ్యలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని హెలిప్యాడ్ వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రితో నియోజకవర్గ అభివృద్ధి గురించి మాట్లాడినట్లు వారు తెలిపారు.

సంక్షిప్తంగా

పంట నష్టాన్ని పరిశీలించిన అధికారులు

మార్కాపురం: ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటల వివరాలపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని మార్కాపురం ఏవో బి.శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని గజ్జలకొండ రైతు భరోసా కేంద్రం పరిధిలో రైతులు సాగుచేసి నష్టపోయిన పంటలను సోమవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రెండుమూడు రోజులుగా వీస్తున్న ఈదురుగాలులు, వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, అరటి పంటలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రైతు నష్టపోయిన వివరాలను నమోదు చేసుకుని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. వర్షాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఏడుగురు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాల (ఏకలవ్యకాలనీ) విద్యార్థులు ఏడుగురు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం భాస్కరశర్మ సోమవారం తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు లీలావతి, గురవయ్య, మల్లేశ్వరి, రత్నతేజశ్విని, స్వాతి, రేచల్, మహేష్ ఎంపికవగా, పాఠశాల ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు అభినందించారు.

దొనకొండలో హిందూ ధర్మ ప్రచారం

దొనకొండ: తెలుగు సంవత్సరాది ఉగాది పండగను పురస్కరించుకుని మండలంలోని పెదన్నపాలెం, నరసింహనాయునిపల్లి, గుట్టమీదపల్లి, దొండపాడు గ్రామాల్లో దొనకొండ కమిటీ ఆధ్వర్యంలో హిందూ ధర్మ ప్రచారం సోమవారం ప్రారంభించారు. శ్రీ ఆచార్య ప్రభోదానంద యోగేశ్వరరావు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంతం ప్రచారం చేశారు. త్రైత సిద్ధాంతం ముఖ్య ఉద్దేశాలు వివరించారు. సమాజంలో ఉన్న కులాలను రూపు మాపేందుకు, ప్రజల మధ్య అసమానతలు తొలగించేందుకు, సర్వ మతాలకు దేవుడు ఒక్కడేనని ప్రజల్లో దైవ భక్తిని పెంపొందించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. కమిటీ సభ్యులు ఏడుకొండలు, చెన్నకేశవులు, పాండురంగయ్య, కాశిలక్ష్మి, వైష్ణవి, సీతమ్మ, కొండమ్మ, ఆదిలక్ష్మి ప్రచారంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష అట్టల పంపిణీ

గిద్దలూరు రూరల్: యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని పాదలకుంటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 40 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు, స్కేల్స్, ఇతర సామగ్రి పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు బొర్రా వెంకటరత్నం మాట్లాడుతూ సొసైటీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ మొర్రి పిచ్చయ్య తన సొంత నిధులతో ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

150 మందికి శస్త్ర చికిత్సలు



శస్త్ర చికిత్సల కోసం వెళ్తున్న వృద్ధులు

గిద్దలూరు రూరల్ : మనోజ్ చారిటబుల్ చైర్మన్ కామూరి రమణారెడ్డి, శంకరరెడ్డి కంటి వైద్యశాల ఆధ్వర్యంలో గిద్దలూరులో ఆదివారం నిర్వహించిన వైద్యశిబిరంలో శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని గుర్తించారు. వారిలో మొదటి విడత శస్త్ర చికిత్స కోసం 150 మందిని గుర్తించి సోమవారం గుంటూరు తీసుకెళ్లారు. ఆపరేషన్ అనంతరం తిరిగి వారిని సురక్షితంగా స్వగ్రామానికి చేరుస్తారు. వైద్య శిబిరం విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న ఫౌండేషన్ బాధ్యులు

తాళ్లూరు: తళ్లపు రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇద్దరు విద్యార్థులకు ఫీజు, పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సామగ్రి అందించి చేయూత ఇచ్చారు. ట్రస్ట్ ఫౌండర్ ప్రశాంతరెడ్డి, కో ఫౌండర్ శివశంకర్‌రెడ్డిలు వెలుగువారిపాలేనికి చెందిన విద్యార్థులు చైతన్య, చరణ్‌కుమార్‌ల చదువులకు అయ్యే ఫీజును గంగా హైస్కూల్ కరస్పాండెంట్ మధుబాబుకు సోమవారం అందించారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు



ఆవులకు టీకా వేస్తున్న డాక్టర్ రాజ్యలక్ష్మి

కొనకనమిట్ల: మండలంలోని పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తగా అన్ని గ్రామాల్లో టీకాలు వేసే కార్యక్రమాలు చేపడుతున్నట్లు గొట్లగట్టు, కొనకనమిట్ల, పెదారికట్ల పశువైద్యాధికారులు వి.రాజ్యలక్ష్మి, అమూల్య, శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. అందులో భాగంగా సోమవారం నాయుడుపేట, నాగంపల్లి, పేరారెడ్డిపల్లి గ్రామాల్లోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ పశుపోషకులు తమ పశువులకు వ్యాధి రాలేదని అశ్రద్ధ చేయకుండా ముందస్తుగా టీకాలు వేయించాలని కోరారు. టీకాల కార్యక్రమం ఏప్రిల్ 24వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ వరలక్ష్మి, సిబ్బంది, పశుపోషకులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థినులకు ఘన వీడ్కోలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కంభం: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థినుల వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు బి.అమూల్య మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. బాలికా విద్య కుటుంబ సంక్షేమంతో పాటు దేశాభివృద్ధికి బాసటగా నిలుస్తుందని తెలిపారు. విద్యతో పాటు క్రీడలు, కళారంగంలో నైపుణ్యత సాధించడం ద్వారా మహిళా సాధికారతకు సోపానాలుగా నిలవాలంటూ పిలుపునిచ్చారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆత్మీయ పలకరింపులు, స్వీయ చిత్రాలతో సందడి నెలకొంది. పీఏసీ చైర్మన్ నీలోఫర్, సీఆర్పీ శైలజ పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట



ప్రతిష్ఠించిన పోలేరమ్మ తల్లి



హాజరైన భక్తులు

దొనకొండ: మండలంలోని రుద్రసముద్రంలో మూడు రోజుల నుంచి గ్రామస్తులు గ్రామ దేవతలను ప్రతిష్ఠించారు. సోమవారం గ్రామ దేవత పోలేరమ్మ తల్లిని ప్రతిష్ఠించారు. పూజారి ఓర్వగంటి సీతారామశాస్త్రి ఆధ్వర్యంలో 15 మంది వేద మంత్రాలతో గ్రామ దేవతలను ప్రతిష్ఠించారు. ఈ ఏడాది వర్షాలు మంచిగా కురిశాయని, పాడి పంటలు సమృద్ధిగా పండాయని, పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర వచ్చిందని సుఖ సంతోషాలతో పిల్లా పాపలు, కుటుంబ సభ్యులతో దేవతను మొక్కుకున్నారు. వచ్చే ఏడాది కూడా సమృద్ధిగా వర్షాలు కురిసి గ్రామాన్ని కాపాడాలని మొక్కులు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో ఇతర గ్రామాల నుంచి భక్తులు విచ్చేశారు. అన్నదానం చేశారు.